కథ

# పై కోర్టు...

పెద్దిభొట్ల సుబ్బరామయ్య

'నా పెళ్లికి రబీంద్రనాథ్ టెగోర్ గారొచ్చారు'.

'అవునా? మీపెళ్లి ఎప్పుడు జరిగింది?'

'అదా? బహుశా... పందొమ్మిది వందల అరవై ఆ ప్రాంతాలలో... బాగా గుర్తు రాలేదు. అప్పుడే పెద్దగాలి వాన కూడా వచ్చి దేశమంతా అల్లకల్లోలమై పోయింది.


'ఆయన్ని అందరూ టాగూర్ అంటారు...' అన్నారెవరో.

'అది తప్పు. టెగోర్ అనే అనాలి. ఆచంట జానకిరామ్ కూడా అలాగే అనేవాడు..'

'ఆయనెవరు?'

'ఆయన ప్రసిద్ధ వయోలిన్ విద్వాంసుడు. నా పెళ్లికి ఆయన కచేరీ కూడా చేశాడు.'

ఇట్లా సాగుతున్నది వరండాలో వ్యవహారం...



నేను బట్టలు వేసుకుని తయారై వచ్చి 'నాన్నా నువ్వు లోపలికి పో... మళ్లీ కాఫీ యిస్తుందిట ఈశ్వరి' అన్నాను.

'అలాగా? వీళ్లతో మాట్లాడుతూ కాఫీ మాటే మరిచిపోయాను' అంటూ వారివంక తిరిగి 'సాయంత్రం మాట్లాడదాం. మళ్లీ...' అంటూ ఆయనలోపలికి వెళ్లాడు.

వాళ్లు నా క్లయింట్స్... నన్ను చూసి అందరూ లేచి నిలబడ్డారు.

నేను మౌనంగా వెళ్లి కూర్చున్నాను. గుమస్తా రంగాచారి, అతని అసిస్టెంట్ సుబ్బరత్నం గారూ చేతులలో కోర్టు దస్త్రాలతో నా పక్కకు వచ్చి నిలబడ్డారు.

మా నాన్న ఒక వెర్రిబాగులవాడు. వయస్సుకు తోడు చిత్తచాంచల్యం... ఊరికే అస్తవ్యస్తంగా వాగుతూ ఉంటాడు. ఆయనను మాటల్లో పెట్టి వాగించి వినోదిస్తారు కొందరు.


ఇప్పుడు నా మనసంతా మహా చిరాకుగా ఉంది. అసహ్యంగాను ఉంది.

ఎదురుగా ముందు కనిపించిన వాడు కోదండరామం... లావుగా పొట్టిగా బొద్దుగా ఉంటాడు. మూతిమీద రెండు బొద్దింకల లాగా ఉంటాయి మీసాలు. అసహ్యంగా.. పొట్ట కిందికి జారిపోయి ఉంటుంది ప్యాంటు.. చేతులు కలిపి దణ్ణం పెట్టాడు.

వీడిది సొంత గొడవకాదు. వీడి కొడుకు ఎవడి దగ్గరో అప్పుచేసి ఎగ్గొట్టి పైగా వాడు బాకీ తీర్చమని అడిగాడని వాడి కాళ్లు విరగగొట్టి జైలు పాలయినాడు. జైల్లో కూడా పక్కఖైదీలతో లేని పోని గొడవలు పెట్టుకుని వాళ్లను నానా తిప్పలు పెడుతూ ఉంటాడు. వాణ్ణి బైటికి తీస కు రావాలి. దానికి ఎంత ఖర్చయినా ఫరవాలేదు. లక్షలు గుమ్మరించడానికి కూడా అతను సిద్ధం.

రంగాచారికి ఫైలు తిరిగి ఇస్తూ 'వాయిదా అడిగించు' అన్నాను.

'అయ్యా! అయ్యా! అట్లా అనకండయ్యా... వాడు కనబడక





పోతే మా ఆడది మంచం పట్టిందయ్యా...' అంటున్నాడతడు.

'మీరు తర్వాత కనిపించండి' అంటూ తర్వాత కట్ట అందుకున్నాను. వీరప్ప కథ అది... అదొక ప్రత్యేక తరహాకథ... వాడు ఎక్కడెక్కడికో వెళ్లిపోయి ఎక్కడో ఒకచోట హైవేమీద లోడుతో వెళ్లే లారీలను ఆపి ఆ డ్రైవరు క్లీనర్లను రకరకాలుగా బతిమాలి ఎక్కి బాగా అనువైన వేళ అనువైన చోట వారి మీద దాడి చేస్తాడు. వారిని బాగా గాయపరిచిగాని, తప్పనిసరి అయితే ప్రాణాలు తీసి గాని లారీని తన శిష్యుడి సాయంతో లోబరుచుకుని లారీలోని లోడ్‌ను దూరంగా ఎక్కడో అమ్మేసి లారీని ఏ నిర్జన ప్రదేశంలోనే వొదిలేసి మహా అమాయకుడిలా క్షేత్రాలు సందర్శించి వొచ్చిన వాడిలా ఇంటికి చేరుకుంటాడు. ఆ మహాదగా కోరు హంతకుడి కొడుకు నా ఎదురుగా నిలబడ్డాడు.

వాణ్ణి చూస్తూ 'ఇదీ వాయిదా అడిగించు' అన్నాను. కొడుకు పేరు రంగస్వామి.

వాడు 'మంచిది సార్! వస్తాను' అంటూ వెళ్లిపోయాడు. వాడు తల్లిపోరు భరించలేక వొచ్చాడు కాని ఇష్టపడి మాత్రం కాదు. ఇంటికి వెళ్లగానే తల్లి ఆదుర్దాగా 'ఏమైందిరా?' అని వాకబు చేస్తే 'ఏముంది? వాయిదా పడింది. మన వెధవ చెత్త కేసులు పరిష్కరించడానికేనా కోర్టులున్నది?' అని జవాబు చెబుతాడు. ఆ తర్వాత తాను బుద్ధిగా పనిచేసుకుంటున్న స్కూలుకు వెళ్లి పిల్లలకు పాఠాలు చెబుతాడు ఆనందంగా.

ఆ పక్కన ఉన్నవాడు మునుస్వామి. అయినవాడని నమ్మి పెద్ద మొత్తంలో డబ్బు అప్పుగా ఇస్తే ఆ డబ్బు తిరిగిరాకపోగా ఆ మనిషితో శత్రుత్వం మిగిలిపోయి నానా యాతనలూ అనుభవిస్తున్నాడు. కాలం తీరిపోయిన నోటు తప్పడు ఆధారమూ లేదు. ఆ నోటు మీద ఎప్పటిదో ఒక చిన్న మొత్తం చెల్లువేయబడి ఉండడం చేత ఆ నోటు ఇంకా కొనప్రాణంతో పడి ఉంది.

కొన్ని వాయిదాలు... కొన్నింటికి జూనియర్ వెంకటేశం... ఇలా పని అయిందనిపించాను. ఇంక రంగాచారి దండుకోవడం మొదలు పెడతాడు. కొందరు కోర్టుకు రానవసరం లేదని పంపించేసి మిగిలిన వారిని పక్కకు తీసుకుపోయి 'అయ్యగారికి నేను చెప్తాగా, వేరే కాయితం పెట్టాలి... కాపీలు తీసుకోవాలి..' అంటూ నసిగి బాగానే గుంజుతాడు. ఆ కేసులన్నీ రంగాచారి పాలిట పాడి గేదెలు.

లేవబోతూ ఉండగా గేటుముందు కారు ఆగింది. కారు దిగి నాగోజీరావు గారు లోపలికి వచ్చాడు. మనిషి ఎందుకో నలిగిపోయి ఉన్నాడు. నెమ్మదిగా నడుస్తున్నాడు.

'రండి రండి' అంటూ ఆహ్వానించాను. కట్టుడు పళ్లతో ముందు వరుసలో కింద మిలమిల మెరిసే బంగారం పన్ను కనిపించేట్టు నవ్వుతూ వచ్చాడు.

'ఏమిటి విశేషం?' అన్నాను కూర్చోమని సైగ చేసూ 'విశేషమే... లోపలికి వెళ్లి మాట్లాడుకుందాం' అన్నాడాయన. 'అలాగే' అంటూ ఆయన్ను వెంట బెట్టుకుని ముందు హాల్లోకి దారి తీశాను.

మా నాన్న అక్కడ పడకుర్చీలో జారగిలబడి కూర్చుని ఉండి 'తక్కువేమీ మనకూ, రాముండొక్క డుండు వరకూ' అని పెద్దగా అరుస్తున్నాడు.

నేను 'నాన్నా, నువ్వు లోపలికి వెళ్లు' అన్నాను. ఆయన కుర్చీలో నుంచి లేచి నాగోజీరావును చూసి 'అరె మీరాపెద్దలు.. రండి రండి... ఏదో పనుండే వొచ్చి వుంటారు. ఊరక రారు మహాత్ములు...?' అంటూ తన ధోరణిని ప్రదర్శించబోయాడు.

నేను విసుక్కుంటూ కటువుగా 'ఏమిటా గోల? ముందు లోపలికి పో' అన్నాను. ఆయన ముఖం కాసింత చేసుకుని లోపలికి వెళ్లాడు. నేను 'చెప్పండి ఏమిటి సంగతి?' అని అడిగాను మళ్లీ. ఆయన వయ

సులో పెద్దవాడు. మా నాన్న ఈయనా సమవయస్కులు.. మా నాన్న చిన్నతనం లోనే స్వాతంత్ర్య పోరాటంలో నిట్టనిలువునా దూకి రకరకాల విన్యాసాలు చేసి అన్నీ పోగుట్టుకుని చివరకు గిరాకీ లేని చిన్న న్యాయవాదిగా మిగిలిపోయాడు. ఆయన ఆ వెర్రిలో పిత్రార్జితం అంతా తగలేసిన కారణంగా నా చిన్నతనంలో చదువుకు కూడా నేను ఇబ్బంది పడ్డాను. ఆయన మాత్రం 'మంచి న్యాయవాది'గా పేరు సంపాదించాడు. నాగోజీరావు ఫక్తు వ్యతిరేకం. న్యాయమనీ అన్యాయమనీ తలతిక్క ఆలోచనలు దరిజేరనీయక మంచిచెడు అనే పనికి మాలిన తర్జన భర్జనలు చేయక ధర్మం అధర్మం అనే వెర్రిశంకలు పెట్టుకోకుండా రెండు చేతులా సంపాదించాడు. ఇంటి నిండా క్లయింట్లు చేతినిండా కేసులు ఇద్దరు ముగ్గురు గుమస్తాలు ఇలా ఆయన ప్లీడరు గిరీ పది కేసులు వంద ఆదాయాలుగా విస్తరిల్లింది. తిమ్మిని బమ్మినిచేసీ బమ్మిని తిమ్మినిచేసి అవతలి వారిలో రకరకాల లొసుగులు వెదికీ, ఆపైన పెద్దనోరు పెట్టుకుని జయించే వాడు. ఒక వేళ ఓటమి సంభవించినా అతనికి వచ్చిన నష్టం ఏమీ లేదు. క్లయింట్స్ తమ తల రాత అనుకుని వెళ్లిపోయే వారు.

మా నాన్న మాత్రం పూర్తి వ్యతిరేకం. అన్యాయపు కేసులు దరికి రానిచ్చేవాడు కదు. ముందు క్లయింట్ చెప్పింది విని లోతుపాతులు విచారించి న్యాయమైనదైతేనే కేసు చేపట్టే వాడు. 'ఆకాడికి నువ్వెందుకు? వేరే ఎందరు లేరు? కేసులో లొసుగు ఉండబట్టి కదా, నీ దగ్గరికొచ్చాం...' అని వాళ్లు విసుక్కొంటూ వెళ్లిపోయేవారు. పైగా బీదాబిక్కీ అనే మీమాంస ఒకటి. ఈ ధోరణి వల్ల ఆయనకు మంచి పేరయితే మేరు పర్వతమంత వచ్చింది కాని లక్ష్మీ ప్రసన్నం మాత్రం కాలేదు. చిన్న చిన్న అవసరాలకు కూడా ఇబ్బంది పడవలసి వచ్చేది. అయినా నేనెప్పుడూ విచారించలేదు. ఆయనను పల్లెత్తు మాట అనలేదెన్నడూ. నాతంటా లేవో నేను పడ్డాను. పట్టా చేతికి రాగానే పెద్ద క్రిమినల్ లాయర్ దగ్గర చేరి శిష్యరికం చేసి బాగానే ఆరి తేరాను. నా శక్తి కొద్దీ న్యాయ దేవతకు గాయాలు చేస్తూనే ఉన్నాను.

నాగోజీరావు దగ్గర నేర్చుకున్నదెంతో ఉంది. ఇద్దరం ఎందరు కరుడుకట్టిన నేరస్థులను ఎందరు హంతు కులను ఒడ్డుకు చేర్చామో లెక్కలేదు. ఆయన సంపద కూడ బెట్టి కూడబెట్టి విశ్రాంతిగా కూర్చున్నాడు. అయితే పాపఫలం సంతానం రూపంలో పట్టి కుదిపింది. కొడుకు బొత్తిగా పనికి మాలిన వ్యర్థుడు. జులాయి. పొగరుబోతు. రౌడీ. చిన్నచిన్న గొడవలతో మొదలై పెద్ద క్రిమినల్‌గా తయారైనాడు. నాగోజీరావు కూడ బెట్టిన సంపద అంతా! చీమలు పెట్టిన పుట్టలు...! చందంగా కరిగిపోవడం మొదలయింది. ఆయన క్రమంగా నీరసించిపోయాడు.

ఇదంతా పాత కథ.

ఇప్పుడు నా ఎదురుగా కూర్చుని 'నువ్వు... నువ్వే ఒడ్డున పడేయాలి...' అంటున్నాడు.

'అసలు విషయం చెప్పండి!' అన్నాన్నేను.

ఆయన హఠాత్తుగా నా చేతులు పట్టుకుని కళ్ల నీళ్లు పెట్టుకున్నాడు.

అయ్యో! ఇదేమిటి అని కంగారు పడ్డాను నేను.

ఆయన కళ్లు తుడుచుకుని 'నువ్వు మాట ఇవ్వాలి' అన్నాడు

'తప్పకుండా' అన్నాను.

నెమ్మదిగా విషయం చెప్పుకొచ్చాడు.

కొడుకు గ్రంథ సాంగుడు. తండ్రి నానా గడ్డీ కరిచి సంపాదించి కూడ బెట్టిన ఆస్తిని యథాశక్తి కరి గించి వేయడం... జులాయిగా తిరగడం... రౌడీస్నేహాలు చేయడం... తగాదాలు తెచ్చు కోవడం... విశృంఖల ప్రవర్తనతో రకరకాల వ్యసనాలు... ఇలా బొత్తిగా నిగమశర్మ గుణ నిధులకు పెద్దన్నలాగా తయారైనాడు. తల్లిలేని పిల్లవాడని చిన్నతనం నుంచి మితిమీరిన గారాబం చేసి వాడు పెడదారి పట్టిపోవడానికి తన వంతుకృషి తానూ చేశాడు నాగోజీరావు. అప్పుడప్పుడు శ్రీకృష్ణ జన్మస్థానం కూడా అలంకరించిన ఘనచరిత్ర వాడిది. పెళ్లి చేస్తే బాగుపడతాడని మంచి కుటుంబంలోని పిల్లనుచూసి కానీ కట్నం తీసుకోకుండా కట్టబెట్టాడు తండ్రి. కాని వాడు మారలేదు. ఆ విశృంఖల రౌడీజీవితం వాడికెంతో థ్రిల్లింగ్‌గా ఉంది మరి. ఈగతమంతా లోకాని కంతటకీ తెలుసు. ఆ పిల్ల కాపురానికి వచ్చి భర్తను దారి మళ్లించుదామని ఎంతో ప్రయత్నించింది. రెండు సంవత్సరాల పాటు మహాఓపికతో కాపురం చేసింది. పుట్టింటికి అన్నలకు వదినలకూ ఏమీ తెలియనివ్వలేదు. కర్ణాకర్ణిగా విని అన్నలు వచ్చి వాకబు చేస్తే 'ఏమీ లేదు. నేను బాగున్నాను' అని అబద్ధమాడింది. 'మా ఆయన శ్రీరాముడు. మా మామగారు దేవుడు' అన్నది.

> 'ఊరుకుంటాను.. నాకెందుకు? వాణ్ణి బైటికి తీసుకొచ్చి మళ్లీ పెళ్లి చేసి మళ్లీ మరో అభాగ్యురాలి గొంతుకోస్తారు. అంతాబాగానే ఉంది. ఇక్కడ... ఈకోర్టులో... గెలుస్తారు... అవసరమైతే హైకోర్టులోనూ గెలుస్తారు. కాని పైన మరో కోర్టు ఉందిరా తండ్రీ... అక్కడేం చేస్తారు?

తర్వాత పరిస్థితి ముదిరింది. అతని అక్రమ సంబంధాలు అక్రమ నడవడి భరించలేక ఒకానొక శుభ ముహూర్తంలో ఎదురు తిరగింది. 'విడిచి వెళ్లిపోతానని' బెదిరించింది. అది అతని పురుషత్వానికి దెబ్బ. దాన్తో అతడామెను క్రూరంగా హింసించి అణిచిపెట్టడం మొదలు పెట్టాడు. ఆమె కూడా క్రమంగా హింసను అనుభవించేందుకు అలవాటు పడి అతన్ని ఒక మృగం లాగానో లేక ఒక కీటకం లాగానో చూడడం మొదలుపెట్టింది. పిలిస్తే పలకడం మానేసింది. సపర్యలు సరేసరి అసలు లేవు. ఆ తర్వాత తనకు వరసకు బావ అయిన వాణ్ణి గురించి వీలయినప్పుడల్లా గొప్పగా మాట్లాడడం మొదలు పెట్టింది. తన బావ అందచందాలు.. అతని ధీర గుణం... అతని చదువు సంధ్యలు. అతని గొప్ప ఉద్యోగమూ... గొప్ప జీతభత్యాలు... ఇలా మాటిమాటికీ చెప్పుకొచ్చి భర్తను ఉడికించడం మొదలు పెట్టింది. పరాయి మగాణ్ణి గురించి తన స్త్రీ అలాంటి విషయాలు మాటిమాటికి చెబుతూ ఉంటే ఏ భర్త సహిస్తాడు? ఆ అమ్మాయి అలా అతన్ని హింసించి ఆనందించడం మొదలు పెట్టింది. ప్రతి క్షణం 'మా బావ అయితేనా?' అంటూ అతన్ని వేధించడం... దాన్తో విచిత్రమైన ఆనందాన్ని పొందడం... నిజానికి అటువంటి బావ అనే వాడెవడూ లేడు.

ఈ దాడి భరించలేక పోయాడు ఆ భర్తగారు. ఒకానొక దుర్ముహూర్తంలో కోపోద్రేకం పట్టలేక చెయ్యి చేసుకున్నాడు. దెబ్బపడరాని చోట పడింది. ఆమె కుప్ప కూలిపోయింది. తిరిగి లేవలేదు. తండ్రీ కొడుకు లిద్దరూ కంగారు పడ్డారు. తాత్కాలికంగా తప్పుకునేందుకు తండ్రి తన క్రిమినల్ బుర్ర ఉపయోగించాడు. ఒక గదిలో ఫ్యానుకు చీరెతో ఆ పిల్ల ఉరిపోసుకుని ఆత్మహత్యకు పాల్పడింది (ట). అప్పుడు భర్త మామ పని మనిషీ ఎవరూ లేరు. ఈ వార్త దావానలం వలె వ్యాపించింది. చుట్టుపక్కల వారు పోగైనారు. ఆ పిల్ల అన్నలు వచ్చారు. పోలీసులు వచ్చారు. పోలీసు ఆఫీసరు మహా కఠినుడు. అతనికే ఆధారాలు కనిపించాయో మరి.. అన్నల దీనాలపాలు విన్నాడు. చుట్టుపక్కల వారి నుంచి వివరాలు సేకరించాడు... గత చరిత్ర అంతా తవ్వి తీశాడు. అంతా చేసి ఆ ప్రబుద్ధుణ్ణి అరెస్టు చేసి తీసుకుపోయి తరువాతి కథ నడిపే ప్రయత్నంలో ఉన్నాడు. ఇదంతా ఇటీవలే జరిగింది.

'కొంత విన్నాను' అన్నాను నేను.

'ఇక నీవే గట్టున పడేయాలి' అన్నాడాయన దీనంగా.

'తప్పకుండా... నేనున్నాను. దిగులు పడకండి. ముందు బెయిల్‌కు పడేద్దాం. ఏమీ కాదు. నేనున్నాను' అన్నాడు

ఆ వెనకే ఉన్నాడు మా నాన్న. ఇప్పుడు ముందుకు వచ్చాడు.

'బాగుంది.. బాగుంది... అవును. మా వాడున్నాడు. కాలాంతకుడు. మీరు దిగులు పడకండి. మీ వాణ్ణి బైటికి తెస్తాడు. ఏ కేసూ లేకుండా చేస్తాడు. వాడు ఏ పాపమూ ఎరుగడని వాదించి తెచ్చి మీకు అప్పజెపుతాడు. ఆ అన్నలున్నారే... వాళ్ల ఏడుపు వాళ్లు ఏడుస్తారు. మీ వాణ్ణి బాజా భజంత్రీలతో కోర్టు నుంచి యింటికి ఊరేగింపుగా తీసుకుపోతారు మీరు..' అంటున్నాడు.

'నాన్నా! ఊరుకో' అంటున్నాను నేను.

'ఊరుకుంటాను.. నాకెందుకు? వాణ్ణి బైటికి తీసుకొచ్చి మళ్లీ పెళ్లి చేసి మళ్లీ మరో అభాగ్యురాలి గొంతుకోస్తారు. అంతాబాగానే ఉంది. ఇక్కడ... ఈకోర్టులో... గెలుస్తారు... అవసరమైతే హైకోర్టులోనూ గెలుస్తారు. కాని పైన మరో కోర్టు ఉందిరా తండ్రీ... అక్కడేం చేస్తారు? అక్కడ వాయిదాలు ఉండవు. హియరింగులు ఉండవు... ఒక్కటే హియరింగ్... అక్కడ మీ అంతరాత్మ జడ్జి. అక్కడేం చెబుతారు? ఏమి చెప్పి తప్పించుకుంటారు?' ఇలా సాగింది ధోరణి.

నేను భయపడి లేచి ఆయనను లోపలికి తీసుకుపోదామని ప్రయత్నించాను.

ఆయన మళ్లీ అంతలోనే నవ్వుతూ 'నాగోజీ గారూ మీ అబ్బాయి పునర్వివాహ శుభ సమయంలో విశ్వనాథ సత్యనారాయణ గారి చేత సంగీత కచేరీ పెట్టించండి...!' అంటున్నాడు.

*


చిరునామా:

పెద్దిబొట్ల సుబ్బరామయ్య

1-4/7-44/3, అండమాని బ్రహ్మయ్య వీధి,

కామకోటి నగర్, విజయవాడ -12.

ఫోన్: 9849550924